# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 83 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం, 19 ఫిబ్రవరి 2026 | పేజీలు : 4








## ఛీ.. ఛీ.. ఛీ.. ఇంత
# దౌర్భాగ్యమా..!

- జటిలంగా తెలంగాణ అక్రెడిటేషన్ అప్లికేషన్

2 లో






## విపత్తుల సమయంలో
# ధైర్యంగా ఉండాలి

- అద్భుతంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ మాక్ డ్రిల్
- వరదల సమయంలో జాగ్రత్త చర్యల పైన అవగహన
- రక్షణ చర్యలపైన అవగాహన ముఖ్యం
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

అకాల వర్షా లు , విపత్కర పరిస్థితుల సమయం లో తీసుకోవలిసిన చర్యల పైన ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజల్లో విపత్తుల పట్ల అవగాహన కల్పించాలన్న ఉద్దేశ్యం తో హైదరాబాద్‌కు చెందిన 10వ బెటాలియన్ నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (NDRF) బృందం ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ ముఖేష్ కుమార్, సెకండ్ ఇన్‌చార్జ్ ఏఎస్సై రొడ్డా మద్దిలెట్టి బృందం లోని హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ ఇతర సిబ్బంది.. అలాగే జిల్లా మెడికల్ కాలేజ్ బృందం, జిల్లా అగ్నిమాపాక శాఖ అధికారులు అకాల వర్షా ల వల్ల వరదలు సంభవించినప్పుడు... ప్రజలు ఎలా అప్రమత్తం గా ఉండాలి, తక్షణమే ఎలా స్పందించి.. ఎలా బయట పడాలి అనే తదితర అంశాల పైన బుధవారం నెల్లూట్ల చెరువు వద్ద చక్కటి మాక్ డ్రిల్ నిర్వహించారు. *- మన చౌరాస్తా, జనగామ*

3 లో




# ఛీ.. ఛీ ఛీ.. ఇంత దౌర్భాగ్యమా..!




- జటిలంగా తెలంగాణ అక్రెడిటేషన్ అప్లికేషన్

**మీడియా అక్రెడిటేషన్ కార్డ్! రాష్ట్రంలో జర్నలిస్టులకు ప్రభుత్వ పరంగా ఇచ్చే గుర్తింపు! ఇందు కోసం అక్రెడిటేషన్లు ఇచ్చే ప్రతి సమయంలో ప్రభుత్వం ఒక తంతు నిర్వహిస్తుంది. అదే దరఖాస్తుల సమర్పించడం..! కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల తర్వాత.. అది కూడా సుదీర్ఘ 'కసరత్తు' తర్వాత ఈ తంతును మొదలు పెట్టింది.**

దరఖాస్తు చేసుకోవడం మొదలు పెట్టిన జర్నలిస్టులకు ఆదిలోనే ఒక సందేహం వ్యక్తమైంది. నిజంగానే ఇది జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు ఇచ్చేందుకు ఉద్దేశించిందేనా? ఎందుకంటే.. ఫేక్ జర్నలిస్టులను పక్కన పెడితే.. నిజమైన జర్నలిస్టు.. దశాబ్దాల అనుభవం ఉన్న జర్నలిస్టుల కూడా దరఖాస్తు చేసుకోలేని దుస్థితి. ఎందుకంటే.. జర్నలిస్టు ప్రయాణంలో ఎన్ని దశలు ఉంటాయో.. ఎన్ని విభాగాలు, హోదాలు ఉంటాయో అన్నింటినీ నిర్వహించిన ఒక సీనియర్ పాత్రికేయుడు తనకు వెటరన్ కేటగిరీలో దరఖాస్తు చేసుకునే అవకాశం లేదంటే ఈ జర్నలిస్టు అక్రెడిటేషన్ కార్డులు ఎవరికి ఇవ్వదల్చుకున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## సతాయిస్తున్న పోర్టల్

'తాంబూలాలు ఇచ్చాం.. తన్నుకు చావండి..' అనే విధంగా తెలంగాణ ఐ అండ్ పీఆర్ విభాగం పనితీరు ఉందన్న విమర్శలు పాత్రికేయ లోకంలో వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు జారీ చేసేందుకు రూపొందించిన అక్రిడిటేషన్ వెబ్ పోర్టల్ మాడ్యుల్ పెద్ద తలనొప్పిగా తయారైంది. అక్రెడిటేషన్ల కోసం దరఖాస్తు చేసుకునే జర్నలిస్టులు యాదగిరిగుట్ట మెట్లు ఎక్కేందుకు ఎన్ని పాట్లు పడతారో అంతకన్నా ఎక్కువగా ఈ మాడ్యుల్‌తో ఇబ్బందులు పడుతున్నారు. ఇన్ని ఇబ్బందులు పడినా ఒక్క మెట్టు కూడా ఎక్కే పరిస్థితి లేదని జర్నలిస్టులు వాపోతున్నారు. కంప్యూటర్ యుగంలో దరఖాస్తు చేసుకునే విధానం సరళంగా ఉండాలి. కానీ.. అసలు జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు నిరాకరించే ఉద్దేశంతోనే మాడ్యూల్‌ను సిద్ధం చేశారా? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి.

## ఫారం మాడ్యూల్లో విచిత్రమైన ఆప్షన్లు

వెబ్ పోర్టల్‌లో అక్రెడిటేషన్ అప్లికేషన్ మాడ్యూల్‌లోకి వెళ్ళి రిజిస్టర్ చేసుకునేందుకు తొలుత మొబైల్ నంబర్ నమోదు చేసుకుంటే వన్ టైమ్ పాస్ వర్డ్ (ఓటీపీ) వస్తుంది. ఓటీపీ నమోదు తరువాత మరో విండో కన్పిస్తుంది. ఈ విండోలో అక్రెడిటేషన్ టైప్, బేసిక్ డిటెయిల్స్, ప్రొఫెషనల్ డిటెయిల్స్, అక్రెడిటేషన్ డిటెయిల్స్ పేరుతో నాలుగు దశలు ఏర్పాటు చేశారు.

- అరిగోస పడుతున్న జర్నలిస్టులు
- కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు..

అయినా సరిచేసే నాథుడే లేరు!

ఒక దశ నుంచి మరో దశకు వెళ్లడానికి అనేక షరతులు పెట్టారు. ఉదాహరణకు పాతిక సంవత్సరాల అనుభవం ఉన్న వర్కింగ్ జర్నలిస్టు నమోదు చేసుకోవాలంటే తొలుత ఫ్రీలాన్సర్, ఆ తరువాత కరస్పాండెంట్, స్టేట్ కార్డు అని వివరాలు నమోదు చేయాలి. ఆ తరువాత కంటిన్యూ బటన్ నొక్కితే బేసిక్ డిటెయిల్స్, ఆ తరువాత రెసిడెన్స్ అడ్రస్ వివరాలు నమోదు చేయాలి. ప్రొఫెషనల్ డిటెయిల్స్‌లో ఎన్ని సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారో ఆ వివరాలు తెలియచేయాలి. ఇందుకు సంబంధించిన నియామక ఉత్తర్వులు పత్రాలను అప్ లోడ్ చేయాల్సి ఉంటుంది.

## ఆర్డర్లు – విద్యార్హతలు.. ఇవెక్కడివి?

రాష్ట్రంలో రెండు మూడు పత్రికలు తప్ప మెజారిటీ దినపత్రికల్లో అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చిన దాఖలాలు లేవు. ఈ విషయం ఐఅండ్ పీఆర్ విభాగంలో పనిచేస్తున్న అధికారులకు కూడా పూర్తిగా తెలుసు. సామాజిక, ఆర్థిక, చారిత్రక, రాజకీయ అంశాలపై లోతైన అవగాహన ఉన్న అనేక మంది అప్పట్లో ఎడిటర్ స్థాయిలో.. అందులోనూ ప్రముఖ దినపత్రికల్లో పనిచేశారు. ఏ ఒక్క రోజు కూడా వారి విద్యార్హత చర్చకు రాలేదు. అలాంటి గొప్పవాళ్లలో టెన్త్‌తో ఆగిపోయిన వారు కూడాఉన్నారు. ఇప్పుడు వారు కూడా విద్యార్హత సర్టిఫికెట్లు అప్ లోడ్ చేయాల్సిన పరిస్థితులు కల్పించారు. దీంతో పాటు గత ఆరు నెలలుగా మేజర్ లేదా మీడియం పేపర్లలో గత ఆరు నెలలుగా వార్తలు రాసి ఉండాలి. అది కూడా బైలైన్ పేరుతో ఉండాలి అని షరతు పెట్టారు. ఈ స్టెప్ దాటిన తరవాత అక్రెడిటేషన్ డిటెయిల్స్‌లో పాత కార్డుల ప్రతులను అప్‌లోడ్ చేస్తే నాలుగు దశలను దాటుతారు. హమ్మయ్య అయిపోయింది. ఇక సబ్మిట్ చేసే దశకు చేరుకున్నామని సంతోషపడే వారికి కొద్ది నిమిషాల్లోనే షాక్ తగులుతుంది. చివరి దశ ప్రివ్యూలో అన్ని వివరాలు సక్రమంగా నమోదు చేసినట్లు నిర్ధారణ చేసుకున్న తరువాత సబ్మిట్ బటన్ నొక్కితే ఎర్రర్, నాట్ అలౌడ్.. ఇలా రకరకాల పేర్లు వెబ్ పోర్టల్‌లో దర్శనమిస్తాయి. దీంతో కథ మళ్లీ మొదటికి వస్తుంది. ఇంకో విచిత్రం ఏమంటే ఎడిటర్‌గా పనిచేసే వాళ్లు కరస్పాండెంట్ కింద దరఖాస్తు చేసుకోవాల్సిన దుస్థితి ఉంది. ఎల్.కే.జీ నుంచి డిగ్రీ వరకు చదివినట్లు సర్టిఫికెట్లు, సర్క్యులేషన్ సర్టిఫికెట్లు ఇలా సవాలక్ష పత్రాలను అడుగుతోంది.

## ఈ ఆప్షన్లు ఎందుకోసం కోసమా..?

పత్రికలు సాధారణంగా జర్నలిస్టులను నియమించే సమయంలో అన్నీ అర్హతలు పరిశీలించిన తరువాత నియమించుకుని చేసుకుని శిక్షణ ఇస్తుంటుంది. అలాంటి వారికి కూడా తామే ఉద్యోగాలు ఇస్తున్నామనే విధంగా ఐ అండ్ పీఆర్ శల్య పరీక్ష చేస్తున్నదని జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు దశాబ్దాలు జర్నలిజంలో ఉండి ఎడిటర్ స్థాయి వరకు వెళ్లిన పెద్దలను కూడా ప్రొఫెషనల్ సర్టిఫికెట్ అడుగుతుందంటే ఎంత 'సరళంగా' మాడ్యూల్ తయారు చేశారో అర్థమవుతుంది. సాధారణంగా రాజకీయ నాయకులకు విద్యార్హలకు సంబంధించి ఎలాంటి ధృవీకరణలు అవసరం ఉండదు. కానీ.. ఒక జర్నలిస్టు విషయానికి వస్తే.. ఆయన సుదీర్ఘ అనుభవం.. సామాజిక అంశాలపై ఆయన అవగాహన.. వివిధ పత్రికలు, మీడియా సంస్థల్లో ఆయన అందించిన సేవలు.. వందల మంది జర్నలిస్టులను తీర్చిదిద్దిన గురుతుల్య బాధ్యతలు.. ఇవే కొలమానాలు. అలాంటి దశాబ్దాల అనుభవం ఉన్న సీనియర్ జర్నలిస్టుకు సైతం ప్రొఫెషనల్ క్వాలిఫికేషన్ సర్టిఫికెట్ అడుగుతున్నారంటే.. ఇది జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు ఇచ్చేందుకా? చెత్తబుట్టలోకి వేసేందుకా? అన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

### నోరు మెదపని యూనియన్లు

**ఏ ఒక్క యూనియన్ కూడా ఇలాంటి కఠిన నిబంధనలపై నోరు విప్పడం లేదని, ఐ అండ్ పీఆర్‌ను కనీసం ప్రశ్నించడం లేదని జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముప్పై సంవత్సరాల క్రితం జారీ చేసిన పత్రాలను అడగడం అన్యాయమంటున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే సజావుగా అక్రెడిటేషన్ కార్డులు జారీ చేశారని, ప్రత్యేక తెలంగాణలో ఆన్‌లైన్ దరఖాస్తుకు సవాలక్ష సంకెళ్లు వేస్తున్నారని మండిపడుతున్నారు.**

## మాజీ ఎడిటర్లు కూడా వార్తలు అప్లోడ్ చేయాలా.?

ప్రధాన పత్రికలలో పనిచేసి, ఆ తరువాత బయటకు వచ్చిన సీనియర్ జర్నలిస్టులు తమ వ్యాపకాన్ని కొనసాగించేందుకు న్యూస్ వెబ్ పోర్టల్‌లో పనిచేస్తున్నారు. అందులో మాజీ ఎడిటర్లు కూడా ఉన్నారు. వారిని కూడా బైలైన్‌తో ఉన్న 20 వార్తలు లేదా ప్రత్యేక కథనాలు అప్‌లోడ్ చేయాలని అక్రెడిటేషన్ మాడ్యూల్ అడుగుతోంది. ఇవి అప్‌లోడ్ చేస్తే తప్ప తదుపరి దశకు వెళ్లడం కుదరదు. వెబ్ పోర్టల్‌లో పనిచేసే సీనియర్ జర్నలిస్టు, మాజీ ఎడిటర్లు ప్రత్యేక వ్యాసాలు, కథనాలు, వార్తలు రాసినా.. ప్రధాన పత్రికలు, మేజర్ పత్రికలు, మీడియం పత్రికలు ప్రచురించే పరిస్థితులు తెలంగాణ రాష్ట్రంలో లేవు. ఫ్రీలాన్సర్ కాకుండా ప్రముఖ పత్రికల్లో పనిచేస్తున్న వారు, టీవీ చానళ్లలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఏ ఒక్కరికి కూడా మూడు నాలుగు సార్లు ప్రయత్నిస్తే తప్ప చివరి దశ ప్రివ్యూ పూర్తి కావడం లేదు. అసలు ఈ నమూనాను ఎవరు రూపొందించారు? కనీస అవగాహన లేకుండా ఆన్‌లైన్ మాడ్యూల్ తయారు చేశారా? అంటూ పలువురు డెస్క్ సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. మాసబ్ ట్యాంక్‌లోని ఐఅండ్ పీఆర్ కార్యాలయంలో పని చేసే అధికారులకు ఫోన్ చేసి మండిపడుతున్నారు.

## దిక్కూమొక్కూ లేని జిల్లా జర్నలిస్టుల గోస

ఇక జిల్లా జర్నలిస్టుల పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. వందల మంది జర్నలిస్టులు, లోకల్ విలేకర్లు ఫోన్లు చేస్తున్నా ఐఅండ్ పీఆర్ ఉన్నతాధికారులు సరిదిద్దే ప్రయత్నం చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. అక్రెడిటేషన్ మాడ్యూల్‌ను ఇప్పటికైనా సరిచేసి, సరళతరం చేయాలని జర్నలిస్టు వర్గాలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి. మాడ్యుల్‌లో మార్పులు చేయనట్లయితే జర్నలిస్టుల నుంచి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకోవాల్సి ఉంటుంది.

***– ఇది ఎన్నో ఏళ్లుగా మీడియానే నమ్ముకుని బతుకుతున సాగిస్తున్న ఓ తెలంగాణ జర్నలిస్టు ఆవేదన..***



# విపత్తుల సమయంలో ధైర్యంగా ఉండాలి

- అద్భుతంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ మాక్ డ్రిల్
- వరదల సమయంలో జాగ్రత్త చర్యల పైన అవగహన
- రక్షణ చర్యలపైన అవగాహన ముఖ్యం
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ, మన చౌరాస్తా : అకాల వర్షాలు , విపత్కర పరిస్థితుల సమయం లో తీసుకోవలిసిన చర్యల పైన ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజల్లో విపత్తుల పట్ల అవగాహన కల్పించాలన్న ఉద్దేశ్యం తో హైదరాబాద్‌కు చెందిన 10వ బెటాలియన్ నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (NDRF) బృందం ఇన్‌చార్జ ఇన్‌స్పెక్టర్ ముఖేష్ కుమార్, సెకండ్ ఇన్‌చార్జ ఏఎస్సై రొడ్డా మద్దిలెట్టి బృందం లోని హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ ఇతర సిబ్బంది.. అలాగే జిల్లా మెడికల్ కాలేజ్ బృందం, జిల్లా అగ్నిమాపాక శాఖ అధికారులు అకాల వర్షాల వల్ల వరదలు సంభవించినప్పుడు... ప్రజలు ఎలా అప్రమత్తం గా ఉండాలి, తక్షణమే ఎలా స్పందించి.. ఎలా బయట పడాలి అనే తదితర అంశాల పైన బుధవారం నెల్లూట్ల చెరువు వద్ద చక్కటి మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుండపోత గా వర్షాలు కురిసి వరదలు సంభవించినప్పుడు ప్రజలు భయపడకుండా ధైర్యం గా ఉండాలన్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అలర్ట్ గా ఉండాలని, వరదల్లో చిక్కుకున్నప్పుడు ఎలా బయట పడాలో తెలుసుకునేందుకు ఈ మాక్ డ్రిల్ కార్యక్రమం ఎంత గానో దోహదపడుతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో విపత్తు నివారణ లో భాగం గా ప్రాణ నష్టాలను నివారించడంలో NDRF, మెడికల్, ఫైర్ అధికారుల పాత్ర కీలకమన్నారు. అనంతరం NDRF, మెడికల్ బృందం, వరదల్లో చిక్కుకున్న ప్రజలు ఎలా బయట పడాలి... ఈత వచ్చినవారు, అలాగే ఈత రాని వారు ఎలాంటి ట్రిక్స్ ని పాటించాలి.... ఎవరి ప్రాణాలకైనా ముప్పు వాటిల్లితే వారిని ఎలా కాపాడాలి, తక్షణమే తీసుకోవలిసిన చర్యల పైన ప్రాక్టికల్ గా చక్కగా వివరించారు. అలాగే అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ... ఆ పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి, గృహాల్లో గ్యాస్ వాడకం పట్ల ఎలా జాగ్రత్త గా ఉండాలి అనే అంశాల మీద అగ్నిమపాక అధికారులు సవివరంగా తెలిపారు. ఈ మాక్ డ్రిల్ నిర్వహణ వల్ల చాలా అవగాహన కలిగిందని, ఇలాంటి కార్యక్రమాలు భయాలను తొలిగించి తక్షణమే తీసుకోవలిసిన చర్యలను సులభం గా అర్థం చేసుకునే అవకాశాన్ని కలిగిస్తాయని అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, ఆర్డీవో గోపిరామ్, వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, లింఘాల ఘనపూర్ తహసీల్దార్, CJIT లో జరుగుతున్న ట్రైనింగ్ లో ఉన్న 5 మండలాల సర్పంచ్ లు పాల్గొన్నారు.







## శ్మశానవాటిక పనులు పరిశీలన

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మున్సిపాలిటీ పరిధిలోని నెహ్రూ పార్క్‌లో వద్ద కొనసాగుతున్న శ్మశానవాటిక అభివృద్ధి పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనుల పురోగతి, నాణ్యతా ప్రమాణాలు, ప్రణాళిక ప్రకారం అమలు పరిస్థితి మరియు మౌలిక వసతుల ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. పరిశీలన సమయంలో శ్మశానవాటిక లో చేపడుతున్న అభివృద్ధి పనులైన అంతర్గత రహదారులు, నీటి వసతులు, పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీ ఏర్పాట్లు, లైటింగ్ సదుపాయాలు, హరిత వాతావరణం కల్పన మరియు ప్రజలకు సౌకర్యవంతంగా ఉపయోగపడే ఇతర మౌలిక సదుపాయాలపై అధికారులతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు. పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న అభివృద్ధి పనులు దీర్ఘకాలిక ప్రయోజనాలను కలిగించే విధంగా ఉండాలని, స్మశానవాటికలను పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు గౌరవప్రదమైన సేవలు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈ ఈఈ (మున్సిపాలిటీ), సంబంధిత ఇంజనీరింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.



## ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లాలో 16 పరీక్ష కేంద్రాలు
- కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలకు పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహన పై చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ పండరి చేతన్ నితిన్ తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి వచ్చే నెల (మార్చి) 16వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో మొత్తం 8,605 విద్యార్థలు పరీక్షలు హాజరుకానున్నారు. ఇందులో 4,211 ప్రథమ సంవత్సరం, 4,394 మంది విద్యార్దులు ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఇందుకు జిల్లాలో 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్దులు నిర్ధేశించిన సమయం లోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జితేందర్ రెడ్డి, విద్యుత్, విద్యాశాఖ, మెడికల్, సంబంధిత శాఖ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక
గురువారం, 19 ఫిబ్రవరి 2026
Mana Chourasta




# జనగామలో పీస్ కమిటీ సమావేశం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆదేశాలతో ఏసీపీ పండరి చేతన్ నితిన్, సీఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్సై చెన్నకేశవులు జనగామ పట్టణంలోని విశ్వ హిందూ పరిషత్ సభ్యులు, ముస్లిం మసీదు అధ్యక్షులు, బజరంగ్ దళ్ సభ్యులు ఇతర సమాజ పెద్దలతో కలిసి శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జనగామ పట్టణంలో సామాజిక సౌహార్దం, పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనం ఎంతో ముఖ్యమని అధికారులు వివరించారు. రాబోయే కార్యక్రమాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని, సోషల్ మీడియాలో వదంతులు లేదా ప్రేరేపించే సందేశాలు వ్యాప్తి చేయకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అన్ని కార్యక్రమాలు శాంతియుతంగా, చట్టపరంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు సంభాషణ, సమన్వయం ద్వారా పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# కడవెండి వాసికి ప్రతిష్ఠాత్మక 'పద్మా చక్ర' అవార్డు



**దేవరుప్పుల, మన చౌరాస్తా :** మండలంలోని కడవెండికి చెందిన సామాజిక కార్యకర్త, సీనియర్ ఫోటోగ్రాఫర్ గుమ్మడవెల్లి సోమన్న ప్రతిష్ఠాత్మక 'పద్మా చక్ర' అవార్డుకు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ ప్రగతీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22 (ఆదివారం)న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ అవార్డును ప్రధానం చేయనున్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న సోమన్న.. రాస్తారోకోలు, సకల జనుల సమ్మె, వంటావార్పు వంటి కార్యక్రమాల్లో ముందుండి నడిచారు. వృత్తిరీత్యా ఫోటోగ్రాఫర్‌గా సేవలు అందిస్తూనే, సామాజిక స్పృహ కలిగించే పలు లఘు చిత్రాలను నిర్మించి ప్రజల మన్ననలు పొందారు. ఆయన సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేయడం పట్ల గ్రామస్తులు, పద్మశాలి సంఘం నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమన్న మాట్లాడుతూ.. తనను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసిన వల్లూరి ఫౌండేషన్ సీవీ శ్రీనివాస్ రాజుకు, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.



# తొరూర్ లో కాంగ్రెస్ సంబురాలు

**తొర్రూరు, మన చౌరాస్తా :** తొర్రూరు పట్టణంలో మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను కైవసం చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ స్థాయిలో విజయోత్సవ సంబరాలు నిర్వహించాయి. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా జరిగిన విజయోత్సవ ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రెడ్డి తో పాటు నూతన చైర్మన్, వైస్ చైర్మన్, కార్పొరేటర్లను గజమాలతో సత్కరించారు.



# తపాలా భీమా చెక్కు అందజేత

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భారత ప్రభుత్వానికి చెందిన భారత తపాలా శాఖ ఆధ్వర్యంలో తపాలా భీమా ప్రయోజనాలను ప్రజలకు చేరవేసే కార్యక్రమం గట్లనర్సింగాపూర్ గ్రామంలో నిర్వహించారు. తపాలా భీమా పాలసీదారుడు గడల రాజయ్య మరణించగా, ఆయన నామినీ అయిన భార్య గడల రాజమ్మకు రూ.3,75,000 విలువైన చెక్కును అధికారులు అందజేశారు. గడల రాజయ్య నెలకు రూ.850 ప్రీమియంతో రూ.2 లక్షల విలువ గల ఇన్సూరెన్స్ పాలసీని గ్రామ పోస్టాఫీసులో తీసుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో ఆయన మరణించగా, పాలసీ ప్రకారం కుటుంబానికి ఆర్థిక భరోసా అందింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తపాలా శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ లక్ష్మీ సత్యబాబు మాట్లాడుతూ, ఇతర బీమా కంపెనీలతో పోలిస్తే పూర్తి ప్రభుత్వ హామీతో తపాలా భీమా సేవలు అందుతున్నాయని తెలిపారు. తక్కువ ప్రీమియంతో అధిక బోనస్ (ఒక లక్షకు RPLI - 4800, PLI - 5200) లభిస్తుందని వివరించారు. తపాలా శాఖ కేవలం బీమాకు మాత్రమే పరిమితం కాకుండా వివిధ పొదుపు పథకాలు కూడా అందిస్తున్నందున ప్రజలు వీటిని వినియోగించుకోవాలని సూచించారు. గ్రామ సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్ మాట్లాడుతూ, 150 సంవత్సరాలకు పైగా విశ్వసనీయ సేవలు అందిస్తున్న తపాలా శాఖను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాన్ని సంపూర్ణ బీమా గ్రామంగా తీర్చిదిద్దేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఎర్రబెల్లి తిరుపతి రావు, సల్పాల తిరుపతి యాదవ్, భీమదేవరపల్లి పోస్ట్ మాస్టర్ జక్కు రజనీకాంత్, MO ఓదెలు, గట్లనర్సింగాపూర్ పోస్ట్ మాస్టర్ తిరుపతి నాయక్, అసిస్టెంట్ పోస్ట్ మాస్టర్ రవీందర్, లంకదాసరి సంపత్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ పాలకవర్గ సభ్యులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# సఖి అవగాహన కార్యక్రమం నిర్వహణ

భీమదేవరపల్లి, మన చౌరాస్తా : భీమదేవరపల్లి మండలం పరిధిలోని వివో కమ్యూనిటీ హాల్లో మహిళల రక్షణ, చట్టాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో సఖి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు సర్వోదయ సంస్థ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ అనిత దేవి మాట్లాడుతూ ప్రతి మహిళకు చట్టాలపై అవగాహన ఉండటం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. మహిళలు తమ హక్కులను తెలుసుకుని ధైర్యంగా ముందుకు రావాలని సూచించారు. అదేవిధంగా సఖి సెంటర్ సేవలు మరియు లక్ష్యాలను సఖి కేస్ వర్కర్ భారతి వివరించారు. గృహహింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాల వంటి సమస్యల నుంచి మహిళలకు రక్షణ కల్పించేందుకు సఖి సెంటర్ పనిచేస్తుందని తెలిపారు. సమస్యలు ఎదురైనప్పుడు మహిళలు ఉమెన్ హెల్ప్‌లైన్ 181, చైల్డ్‌లైన్ 1098కు కాల్ చేయడం ద్వారా తక్షణ సహాయం పొందవచ్చని చెప్పారు. అలాగే 08702452112, 7382983088 నంబర్ల ద్వారా కూడా బాధిత మహిళలకు సహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు.



# విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ముల్కనూర్ గ్రామంలోని శ్రీ విశ్వేశ్వర పాత శివాలయంలో నిర్వహించిన శివపార్వతుల కళ్యాణ మహోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమం చేపట్టారు. కీర్తిశేషులు దార్న పెంటయ్య జ్ఞాపకార్థంగా ఆయన మనవడు డాక్టర్ అరుణ్ కుటుంబ సభ్యులు స్కూల్ విద్యార్థులకు లంచ్ బాక్స్‌లు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తూ తమకు అందిన విద్యా సామగ్రి చదువుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సేవా కార్యక్రమం నిర్వహించిన కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ అభినందించింది. దార్న పెంటయ్య జ్ఞాపకార్థంగా నిర్వహించిన ఈ కార్యక్రమం సామాజిక బాధ్యతను ప్రతిబింబిస్తుందని ఆలయ కమిటీ పేర్కొంది. వారి కుటుంబానికి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించింది.



Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**